కథానిక

# "సంసారిరాజు"

ముద్దంశెట్టి హనుమంతరావు

"ఏం జన్మలో నాలుగుడబ్బులు వెనకేయలేం. యెందుకొచ్చిన బ్రతుకులండీ!"

"వెనకేయటానికి మనకేమంత యెక్కువ జీతం వచ్చిపడుతోందని? ఎంతకష్టపడినా నెలకి ఆ యేభైరూపాయలేగా!"

"పెండికొద్దీ రొట్టన్నట్టు మనకితగ్గ ఖర్చులు మనం చెయ్యాలి. అందులోనే కొంత ఆదాయం చెయ్యాలి"

"అసలు నిత్యజీవితానికే చాలకుండావుంటే అందులో యింక ఆదాయం ఒహటి!"

"ఎందుకు చాలదు? మీ రనవసరపు ఖర్చులు మానేయండి ఎలా మిగలదో చూద్దాం"

"అనవసరపు ఖర్చు లేం వున్నాయని?"

"మీకెన్ని సార్లు చెప్పాను సిగరెట్లు మానేయమని? నా మాట లెక్ఖచేస్తేకదూ!"

"అదా! నేనుమాత్రం యెన్ని త్రాగేస్తున్నానని? అంతా లెక్ఖమీదే"

"అదే అనుకోండి - ఎంత ఖర్చవుతుందని? కనీసం నెలకు ఓ అయిదురూపాయలేనా అవుతుందామరి?"

"ఏదీ అంతమటుకూ యెక్కడవుతుందీ?"

"మహా మీరంత అదుపులో వాడుతున్నట్లు మాట్లాడతారేం? స్నేహితులెవరైనా వున్నప్పుడయినా యెక్కువకావూ?"

"ఆ మాట నిజమేలే-"

"మరేం-నన్నోచవటక్రింద జమకడతారు"

"ఆమాత్రంస్వంతఖర్చువుండకపోతేయెలా?"

"మీకలాగే వుంటుంది. ఆదాయం చెయ్యాలంటే యిలాంటి ఖర్చులు మానేయాలి" అంది కోపంగా సుగుణ. క్రిష్ణమూర్తి జవాబు చెప్పేందుకు పదాలు దొరక్క తికమకపడుతూ ఆలోచనలో పడ్డాడు. నిజమే! భార్య చెప్పింది అక్షరాలా నిజం-తను సిగరెట్లుకోసం తగలబెడుతున్న డబ్బు ఆదాయం చెయ్యొచ్చు. ఛీ! యేం సిగరెట్లు-యింటికీ, వంటికీ కూడా నష్టమే! పొగత్రాగటం, గుండెలు కొరుక్కుపోవటం, తరువాత ఆసుపత్రి. యెందుకీ గొడవలు? సుగుణ చెప్పిందంతా వేదం అనుకున్నాడు మూర్తి.

"నువ్వు చెప్పింది నిజమే గాని-" అర్థోక్తిలో ఆపాడు. "కానీ, గీనీ మరింకేం లేదు. యీ రోజుతో సిగరెట్లకు స్వస్తిచెప్పాలి."

"అలాగే లేవే-మానేస్తాను"అన్నాడుమూర్తి.

నిజం చెప్పుకోవాలంటే సుగుణ యేం చెప్తే అది అక్షరాలా పాటిస్తాడు. క్రిష్ణమూర్తి. ఆ రోజు భోజనం మానేయమన్నా మానేస్తాడు కూడా. సుగుణ భర్త మెత్తతనాన్ని, చేతకానితనాన్ని చూసి మరింత రాజ్యమేలాలనుకుంటుంది. ఆ రోజునుండి క్రిష్ణమూర్తి సిగరెట్టు కాదుకదా కనీసం చుట్టముక్కయినా ముట్టలేదు. నెలాఖరున మూర్తి గమనించాడు తనదగ్గర అయిదు రూపాయలవరకూ మిగిలింది. యీ పద్ధతి బావుందనుకున్నాడు.

"నాకో మంచి జాకెట్టు బట్ట తీసుకరారూ?" ఓరోజు అంది సుగుణ.

"ఇప్పుడు డబ్బెక్కడుంది?"అనేశాడు మూర్తి.

"ఎందుకులేదూ! మిగిల్చిన అయిదురూపాయలున్నాయిగా?"

"ఆదాయంమాట మర్చిపోయావేంమిటి?"

"ఆదాయం తరువాత చూసుకోవచ్చు. అనవసరపుఖర్చు తగ్గిందిగా. యీ ఒక్కసారిమాత్రం తెచ్చిపెట్టండి జాకెట్టు బట్ట. మళ్ళీనెలనుండి నాకేంవద్దు."

"సరేలే! రేపుతెస్తాలే—కాని, నా వుద్దేశం యేంమిటీ అంటే నెల నెలా కాస్త డబ్బు నిలవ చేసుకుంటే బాగుంటుందని-"

"నిలువచేస్తే యెవరొద్దన్నారు? అసలు యెలా జరుగుతుందీ అని - మన ఖర్చులుచూస్తే అపరిమితం..." అంది సుగుణ.

"ఇంకేం అపరిమితమైన ఖర్చులున్నాయ్?" ఆశ్చర్యంగా అడిగాడు క్రిష్ణమూర్తి.

"యింకేం గావాలి? కూరలకింతంత పోస్తున్నామా?"

"యింకా ఎంత తగ్గించుకునేది కూరలు?" మెల్లగా అన్నాడు.

"తగ్గించుకోవాలి - ఎల్లకాలం ఒక్కలాగే వుంటే నాలుగు డబ్బులు కూడబెట్టేదెప్పుడు?" అంది సుగుణ.

ఇప్పుడుకూడా భార్య మాటలు శోచనీయమైన వనే నమ్మాడు. దూరంగా ఆలోచిస్తే నాలుగు డబ్బులు కూడబెట్టుకోవల్సిందే- లేకపోతే ఏ కష్టసమయంలో యెవరిస్తారు" తెచ్చుకున్న దంతా ఖర్చు బెడితే యెంతయినా చాలదు.

"అయితే యేం తగ్గించుకోమంటావ్? నిత్య జీవితంలో అవసరమయ్యేవి ఏం మానేయగలం?"

"ఏవీ మానేయలేం అనుకోండి-కాని తగ్గించుకోవచ్చుగా-కాయగూరలకు ఇంతడబ్బు పొయ్యకపోతే కొంత మిగల్చవచ్చు. తినటానికేం— రోజూ పంచభక్ష్య పరమాన్నాలతో తినొచ్చు వుంటే."

"సరే, అలాగేలే" అంటుంగా ఎనిమిదేళ్ల కొడుకు రవణ

"నాన్నా! యివ్వాళ మాస్టరుగారు జీతం అడిగారు."

"ఏంజీతం?"ఆశ్చర్యంగా అడిగాడు మూర్తి.

"నాకు చదువు చెప్పినందుకు."

"ఏదో తెలిసినవాడుకదా అని, ఒకేదగ్గర పనిచేస్తుంటామని, వూరికే కూర్చున్నకంటే వాళ్ల అబ్బాయితోపాటు నీకూ చదువు చెప్పమన్నానే గాని, యిలా జీతం తీసుకుంటాడని తెలిస్తే అప్పుడే మాన్పించేద్దును."

"ఉత్తినే యెవరు చెప్తారు నాన్నా?"

"నువ్వూరుకో వెధవా..." అంది సుగుణ.

"మీరైనా మొదట తెలుసుకోవద్దూ! వీడు చదివిన చదువుకి జీతం ఒకటా? అయితే యెంత తెమ్మన్నారు?"

"మూడు రూపాయలమ్మా!"

"మూడు రూపాయలే! యీ నెల యెలాగో ఆ మూడురూపాయలూ అతని ముఖంమీద పడేసి చదువు మాన్పించండి. ఆమాత్రం యింట్లో చెప్పుకోలేక పోతామా? అయినా యేం చోద్యమండీ! వీడి చదువుకి మూడు రూపాయలే-అంత చౌకయిపోయింది డబ్బు యీ రోజుల్లో."

"నిజమే సుగుణా! మూడు రూపాయలే! నే నడుగుతానుండు తగ్గిస్తాడేమో?"

"మీరడగావద్దు - అతను తగ్గించనూవద్దు. చదువుమాన్పించండి. ఆ మూడు రూపాయలుంటే దేనికైనా పనికొస్తుంది."

"మరి వీడి చదువో? వెధవ వూర్లో సరియైన స్కూలుకూడా యేడ్చిందికాదు."

"చదువా? మీరు చెప్తారు-ఆమాత్రం చెప్ప లేరుటండీ?"

"పగలంతా ఎముకలు విరిగేట్టు కార్ఖానాలో పనిచేసి సాయంకాలం విశ్రాంతి లేకండా వీడికి చదువు చెప్పటం యెలా సాధ్యమవుతుంది?"

"కష్టపడాలండీ! లేకపోతే—"

"సరేలేరా రవణా! నేను రేపు కార్ఖానాలో అతడికి డబ్బు యిచ్చేస్తాలే—రేపట్నుంచి నువ్వు మరి చదువుకి పోవద్దు."

"నాకు మరీ మంచిది నాన్నా..." గంతు లేసుకొని పోయాడు రవణ.

మరుచటిరోజునుండి రవణ చదువు సన్నగిల్లింది. పగలంతా ఆట. సాయంకాలంపూట తండ్రిదగ్గర యేవో నక్కకూతలు కూసేవాడు. అలసివచ్చిన మూర్తి మెదడుకింకా శ్రమ కలిగించ లేక అంత శ్రద్ధ చూపేవాడు కాదు. ఇది బయటకు తెలుస్తే సుగుణ యేమంటుందోనన్న భయం వుండే దతనికి. ముఖ్యంగా రవణ కిప్పుడు స్వేచ్ఛ దొరికింది.

"అమ్మా! పిడికెడు బియ్యం వెయ్యండమ్మా" మూడుసార్లు అడిగాడు ముష్టివాడు. దగ్గరే కూర్చున్నా వినిపించుకోనట్టుగా వూరుకుంది సుగుణ. అరుస్తూ, అరుస్తూ వాడి నోరుకూడా అలసిపోయి దాహంపుట్టే పరిస్థితికి వచ్చింది. అయినా ఆశతో మరోసారి అడిగాడు. సుగుణ మూతి విర్చుకుంటూ.

"ఎన్నిసార్లు చెప్పాలి వెళ్ళమని? పనిలో వుండటం చూస్తుండలేదూ? మీకు మరీ చెప్పలేం-శనిగ్రహాల్లా విడువరు" అని నాలుగు చీవాట్లు పెట్టింది. చీవాట్లు పెట్టినా, కాసిన్ని బియ్యం పడేస్తే అంత బాధపడేవాడు కాడు ముష్టివాడు. అదీ జరగలేదు. ఖర్మంకాలి ముష్టివాడుగా మారినా, ఆత్మ ముష్టిది కాదుగా—"ఛీ! ఇలాంటి

యిళ్ళకు రావటమే తప్ప-కొద్దిగానైనా కనికరం లేదు" అనుకుని గొణుక్కుంటూపోయాడు ముష్టివాడు.

అప్పుడేవస్తూన్న కృష్ణమూర్తికి ముష్టివాని మాటలు అస్పష్టంగా వినిపించాయి. లోపలికి వస్తూ—"ఏమిటి సుగుణా! ఆ ముష్టివాడు గొణుక్కుంటూ పోతున్నాడు?" అన్నాడు మూర్తి.

"ఇంకేంవిటి? పనిలోవున్నాను వీల్లేదన్నా"

"ఇప్పుడేం పనిచేస్తున్నావని? కాసిన్ని బియ్యం పడేయలేక పోయావ్?"

"మహాధర్మాత్ములు వచ్చారు. ఆ మాత్రం తెలీకపోలేదు. ఎంతమంది ముష్టివాళ్ళకని బియ్యం వేస్తాం? అందులో యిప్పుడు మరీ యెక్కువై పోయారు ముష్టివాళ్లు. అవుంటే ఓపూట ఒక మనిషి భోజనానికవుతుంది" అంది సుగుణ. ఆమెకళ్లల్లో క్రోధం, అజ్ఞ కనుపిస్తున్నయ్.

మూర్తి యిప్పుడుకూడా ఆమె మాటల్లోని సత్యం నమ్మకండా వుండలేకపోయాడు. ఆమె మాటలువింటూ ధర్మబుద్ధికూడా పోగొట్టుకుంటున్నాడు. "ఇంకాపషయం కట్టిపెట్టులే కాని రేపు త్రినాధమేళాచేస్తే బావుంటుం దనుకుంటున్నా" అన్నాడు మూర్తి

"నేనూ అదే అనుకుంటున్నానండీ! మనకీ దరిద్రం వదలాలంటే ఆ త్రిమూర్తులే దిక్కు" అందా మహాయిల్లాలు.

"అయితే పూజకేం తెమ్మంటావ్? కొబ్బరి కాయ తేనా?"

"ఎందుకూ? అటులుకు పెట్టేమొచ్చు లెద్దురూ!" అంది సుగుణ

"నిజంగా నీ తెలివితేటలకు మెచ్చుకోవాలి! సుగుణా!" అని భార్యని పొగిడాడు మూర్తి. సుగుణ ఓచిన్న నవ్వు నవ్వింది తన తెలివితేట్లకి.

త్రినాధ మేళాలు మాత్రం నెలకు రెండు మూడుసార్లు చేస్తున్నారు. కృష్ణమూర్తి సిగరెట్లు మానేసి చాలకాలమయింది. కూరగాయల్లో చాల తగ్గుబడివచ్చింది. ఉదాహరణ చెప్పుకోవాలంటే, ఓశేరు వంకాయలు ఓవారమంతా గడిపేది సుగుణ. కూరగాయల విషయంలో రెండు మూడుసార్లు యెమరుతిరిగి లాభంలేక నోరు మూసుకున్నాడు. రవణ చదువు, ఎండాకాలం చదువుగానే వుండిపోయింది. మొదట వచ్చిన ఆ కాస్త చదువుకూడా మర్చిపోయాడు రవణ. దాన్నంతగా పట్టించుకోలేదు సుగుణ. ఆమెకు మూడురూపాయలు మిగుల్తున్న వంతే చాలు. కృష్ణమూర్తి కొడుకు చదువు విషయంలో ఆలోచిస్తుంటాడు. కానిభార్యనిఎదిరించలేకపోయాడు.

కొద్దిదినాలు గడిచినయ్-బంధువుల పెళ్ళి పత్రం వచ్చింది. దూరపు బంధువయితే ఏపూచీ లేకపోయి వుండేది. చాలాదగ్గర బంధువులు-వెళ్ళకతప్పదు వెళ్ళేందుకు తగినబట్టలుండొద్దూ?

"రెండుజతల బట్టలయినా కుట్టించుకోవాలని వుంది సుగుణా- పెళ్ళి మరి-చాలామంది వస్తారు. ఇప్పుడు నాదగ్గరవున్న డబ్బులో కొంత ఖర్చు పెట్టాలనుకుంటున్నాను."

"ఏమాత్రం అవుతుందంటారు?"

"కనీసం ఇరవై రూపాయలయినా వుండాలి."

"ఇరవై రూపాయలే! అంతడబ్బు అనవసరంగా ఖర్చుబెడితే యెలా చెప్పండి?"

"నాకున్న యీ చినిగినబట్టలు, చౌకబారు బట్టలతో యెలాపోయేది? ఓ మంచి చొక్కా ఒకాటి ధోవతి ఒకాటయినా వుండొద్దూ?"

"వుండాలి మరి-కాని యెలా వస్తాయ్? ఓ పని చెయ్యండి-మీ తమ్ముడిదగ్గర మంచి బట్టలుంటాయికదూ? ఓ రెండుజతలడిగి పుచ్చుకోకూడదూ?"

"నీఆలోచనబావుందిగాని వాడిస్తాడాఅని?"

"ఎందుకివ్వడు? మీ రడిగితే తప్పకండా యిస్తాడు. ఆ రెండు జతలతో మీ పెళ్ళి ప్రయాణం సాగిపోతుంది."

"ఐతే వధువు కేమిటి చదివిద్దామంటావ్?"

"ఓ ఐదురూపాయలు చదివిద్దురూ-చాలు"

"నాకు ఆత్మీయ బంధువులని తెలిసికూడా అయిదురూపాయ లేముఖంతో చదివిస్తా ?"

"నాకు తెలుసు-యెప్పుడు మీ బంధువులక్క మేపితేనే సరిపోతుంది; అయిదు కాదు-యాభై చదివించండి. నాకేం?" అంది కోపంగా

"ఎందుకు సుగుణా ఆ కోపం? మాటవరుస కన్నానుగాని నువ్వన్నమాట కెదురుందా?"

"ఆ! తరువాత అక్కడ ఖర్చులే మంత. యెక్కువ వుండకూడదు ఓ రెండురూపాయలుతీసు కెళ్ళండి ఖర్చులకి."

"రెండులూపాయలేంచాల్తాయ్? పూనువిడిచి

పరాయిప్రదేశం పోతున్నా, కాస్త యెక్కువ పట్టుకుంటే యేంపోయింది?"

"పందకట్టుకున్నా యేంపోయింది? మీరలాంటి వారనే ముందుగా చెప్తున్నా. రెండురూపాయల కంటె యెక్కువ ఖర్చు కాకూడదు. అయినా యిప్పుడేరావాలా మనపాలిట యీ పెళ్ళి—" అని విసుక్కుంది. భార్యకు జవాబుచెప్పే ధైర్యం మొదటినుంచీ తక్కువే మూర్తికి.

"అమ్మా! ఓ పావలా వుంటే యియ్యవ్," అన్నాడు రవణ అప్పుడేవచ్చి.

"వీడొకడు! మా బాగా తయారయ్యాడు. మాటాడితే డబ్బుకావాలి. ఎందుకురా రమణా యిప్పుడు పావలా? ఒక్కసారి పావలాతో యేం కొంటావ్?"

"కొనుక్కుందుకు కాదమ్మా! సినిమాకి స్నేహితులందరూ వెళ్తున్నారు. నేనూ వెళ్ళదామని."

"అబ్బో! యిప్పట్నుంచే సినీమాల రుచి తగిలింది! అయినా నీకు మానాన్నదగ్గర కొద్ది భయం కూడా లేదు. చదువుచూస్తే రేం లేదుగాని, అది కావాలి-యిదికావాలి అంటావు." అని కసురుకుంది.

"నాన్న నేనేపడిగినా చెప్పరమ్మా" అని అసలు విషయం వెళ్లబుచ్చాడు. ఆ చిన్న హృదయానికి అంతరంగిక విషయాలేం తెలుసు?

"ఏమండీ! నిజమేనా?"

మూర్తి కాస్త ధైర్యం తెచ్చుకున్నాడు.

"నిజమే సుగుణా! పగలంతా యెముకలు విరుచుకుని పని చేసుకునివచ్చి మళ్ళీ మెదడుకి పని కల్పించి చెప్పటం నాచేతకాదు. అందుకే మళ్ళీ వీణ్ణి మాష్టరుదగ్గర పెట్టించాలనుకుంటున్నాను. యీ ఆరుమాసాల్లో వాడు నేర్చుకున్నది సున్నా; కాక వచ్చిందికూడా మర్చిపోయాడు"

"మర్చిపోడూ! మీరుచెప్తేగా? మీరోసోమరి. నాకు తెలుసు. వళ్లువంచితేగా-మీరుచెప్పకపోతే నాకామాత్రం చేత కాదనుకున్నారా?"

"మరింకేం? నువ్వేచెప్పు, మంచిదే--" అంటూ కృష్ణమూర్తి పోయాడు.

"ఏంరా రవణా! నీకు సినీమాలు యెక్కువవుతున్నయ్. వెధవా! యింట్లో తిని కూర్చోక యెక్కడికి పోతావ్?" అని గదమాయించింది. దాంతో రవణ గుణుస్తూపోయి మంచమెక్కాడు.

కృష్ణమూర్తి కొడుకు చదువు విషయం అప్పుడప్పుడాలోచిస్తూ, మాష్టరుదగ్గర చదువుచెప్పించేందుకు నిశ్చయించుకుని ఆ సంగతి భార్యతో అన్నాడు. ససేమిరా వద్దంది సుగుణ. తనే స్వయంగా చెప్తానని పట్టుపట్టింది. మూర్తి జవాబు చెప్పలేకపోయాడు. నాలుగురోజులు తనేచెప్పింది. సుగుణ. యిటు వంట. అటు యింట్లోని యితర పనులు చూసుకుని రవణకి చదువుచెప్పటం ఆమెకీ కష్టమన్పించింది. పోగా ఆమెకు కొన్నివిషయాలు తేలీనే తెలియవు. ఏం చదువుకుంది గనుక తెలిసేందుకు? చివరకు కాస్త కూడఁబెట్టుకోవాలన్న ఆశ అడుగంటి మళ్ళీ మాస్టరుదగ్గరికే పంపమంది.

ఇది యిలా వుండగా ఆహారం సరిగ్గా లేక పోవటంవల్ల, కృష్ణమూర్తి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. రోజురోజుకి చిక్కిశల్యమై కృశించి పోయాడు. నీరసంవల్ల డ్యూటీకీకూడా పోలేక మంచమెక్కాడు. డాక్టర్ని పిలిపించింది సుగుణ. డాక్టరుమాత్రం యేంచేస్తాడు? సరియైన ఆహారం లేమిచే యీ రోగం వచ్చిందనీ, నరాల్లో పటుత్వం తగ్గిందని, అందుకు చాలామట్టుగ యింజక్షన్లు తీసుకుంటేనేగాని వీల్లేదని చెప్పాడు. సుగుణ గుండెలు జల్లుమన్నయ్. డాక్టరు చెప్పినట్టుగా నడుచుకోవాల్సివచ్చింది. దగ్గరదగ్గర అరవైరూపాయలు ఇంజెక్షన్లకు అయ్యాయ్. డాక్టరు ఫీజుతో కలిపి నూరుకి దగ్గరపడింది.

ఎలాగైతేనేం కృష్ణమూర్తి ఆరోగ్యం కుదుటబడింది. కొద్దిదినాల్లోనే డ్యూటీకిపోయే శక్తికూడా వచ్చింది. డాక్టరు మరీమరీ చెప్పాడు—మంచి ఆహారం తీసుకోమని.

"మీకీ రోగంరాకపోతే నేనీ డబ్బుతో ఓ నెక్లెస్ కొనుక్కోవాలనుకున్నానండీ," అంది ఓ రోజు సుగుణ.

"నీ నెక్లెస్‌కోసమే చూసుకున్నావుగాని, నా ఆరోగ్యం కుదుటబడినందుకు సంతోషించావు కాదు సుగుణా! యిక బుద్ధి తెచ్చుకున్నాను. యీ పొదుపుఫలితాలిలావుంటాయని-కుర్రాడి చదువూ అలాగే మంటగలిపావు. నాకీ పొదుపూవద్దు, ఏం వద్దు. హాయిగా వున్నది తిని బతుకుతే చాలు" అన్నాడు మూర్తి. సుగుణ, భర్తలో మార్పుకి ఆశ్చర్యబడి, మూతి విరుచుకుంది.